సాక్షి నిర్మల్

బుధవారం : 16 : ఏప్రిల్ : 2025



జీవాల పెంపకానికి చేయూత

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాంసం ఉత్పత్తులు పెంచాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. జీవాల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. 8లో▸

జిల్లా నూతన జడ్జిగా శ్రీవాణి

నిర్మల్: జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి ఎ.కర్ణకుమార్ బదిలీ అయ్యారు. రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు. జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జిగా ఎస్.శ్రీవాణి నియమితులయ్యారు. ఇదివరకు ఎస్సీ,ఎస్టీ(ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ)యాక్ట్, హైదరాబాద్ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, సిటీ సివిల్‌కోర్టు అడిషనల్ చీఫ్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.6 /26.6

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు వేడి సెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- ఏఎస్పీ రాజేశ్‌మీనా



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

లక్ష్మణచాంద: శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. మండలంలోని మునిపెల్లి గ్రామంలో మంగళవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 90 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో ఏఎస్పీ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోకి అపరిచితులు వచ్చినా, అసాంఘిక కార్యకపాలు జరిగినా, దొంగతనాలు జరిగినా సీసీ కెమెరాలతో త్వరగా గుర్తించే వీలుంటుందని వివరించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రూల్స్ తప్పకుండా పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, అపరిచితులకు పిన్, ఆధార్, వ్యక్తిగత వివరాలు చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు మాలిక్ రెహమాన్, గోపి పాల్గొన్నారు.

మార్కింగ్ పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ (ముగ్గు పోసే ప్రక్రియ) ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మంజూరైన ఇళ్ల లబ్ధిదారులు పూర్తిచేసిన మార్కింగ్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ దగ్గరుండి చేయించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు రావొద్దు

భైంసారూరల్: మండలంలో నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పొలాలకు వెళ్లే రహదారులు నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

నిర్మల్ రూరల్: జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారంతో ముగిసింది. జిల్లా కేంద్రం శివారులోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఈనెల 7 నుంచి తొమ్మిది రోజులపాటు జిల్లాకు వచ్చిన 1,27,896 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. స్పాట్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మూల్యాంకనంలో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ముడారపు పరమేశ్వర్, రమణారెడ్డి, 8 మంది సహాయ క్యాంప్ ఆఫీసర్లు, 58 మంది సీఈలు, 356 మంది ఏఈలు, 123 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం దాదాపు 550 మంది పాల్గొన్నట్లు డీఈవో రామారావు వివరించారు. కోడింగ్, జవాబు పత్రాల మూల్యాంకనంలో పొరపాట్లు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలి



ఉపాధ్యాయులను సన్మానించిన డీఈవో

నిర్మల్ రూరల్: సమాజంలో ఉపాధ్యాయులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని డీఈవో రామారావు అన్నారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అనుముల కమలాకర్‌రావు, పెంట శంకర్, కృష్ణారావు, పద్మలత, ప్రభకుమారి, శ్రీనివాస్‌ను సెయింట్ థామస్ పాఠశాలలో మంగళవారం సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఇందులో జిల్లా సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి భూషణ్, ఆర్థిక కార్యదర్శి ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి, మధు, ఏసీజీ పరమేశ్వర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

సన్న బువ్వ సూపర్

- అమ్మకుండా.. వండుకుంటున్నారు..
- పంపిణీపై లబ్ధిదారుల సంతృప్తి
- రేషన్‌షాపుల వద్ద బారులు



నిర్మల్‌లోని ఓ రేషన్ షాపులో సన్నబియ్యం..



చిన్నారికి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నపు బియ్యం అన్నం తినిపిస్తున్న తల్లి

నిర్మల్ చైన్‌గేట్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్న బియ్యం నాణ్యతపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరైన పద్ధతిలో వండితే ఎలాంటి సమస్య లేదని, గంజి సరిగా వార్చకపోతే కొద్దిగా మెత్తగా ఉంటుందని పేర్కొంటున్నారు. జిల్లాలో ఈనెల మొదటి వారంలోనే సన్న బియ్యం సరఫరా ప్రారంభమై, 80 నుంచి 90 శాతం మంది లబ్ధిదారులు ఇప్పటికే తమ కోటా బియ్యం తీసుకున్నారు.

నాణ్యతపై ప్రజల ఆనందం

రేషన్ షాపుల ద్వారా గత నెల వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. వీటిని చాలా మంది విక్రయించి సన్న బియ్యం కొనేవారు. అమ్మిన బియ్యాన్నే మిల్లర్లు మళ్లీ సేకరించి ప్రభుత్వానికి అప్పగించేవారు. అయితే అక్రమాలకు చెక్ పెట్టేందుకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల నుంచి పంపిణీ ప్రారంభించింది. జిల్లాలో పంపిణీ సజావుగా సాగుతోంది. లబ్ధిదారులందరూ సన్న బియ్యం తీసుకోవడమే కాకుండా వండుకుని తింటున్నారు. దీంతో అమ్మేవారు కనిపించడం లేదు. కొత్త బియ్యం కావడంతో కొంత మెత్తదనం ఉన్నప్పటికీ, సరైన వంట పద్ధతులతో ఈ సమస్యను అధిగమించవచ్చని చెబుతున్నారు. కొన్ని చోట్ల స్వల్పంగా నూకలు ఉన్నప్పటికీ, గతంలో అందించిన దొడ్డు బియ్యంతో పోలిస్తే సన్న బియ్యం రుచి, నాణ్యతలో ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఈ నెల 15 వరకు రేషన్ తీసుకున్న వారి వివరాలు:
జిల్లాలోని మొత్తం రేషన్ షాపులు 412
ఇప్పటివరకు రేషన్ అందుబాటులో ఉన్న షాపులు 407
జిల్లాలోని మొత్తం కార్డు దారులు 2,08,380
రేషన్ పొందిన కార్డు దారులు 1,68,016
లబ్ధిదారులకు పంపిణీ చేసిన సన్న బియ్యం 35,07,083 కిలోలు

తినేందుకే ప్రాధాన్యం

గతంలో దొడ్డు బియ్యం పంపిణీ సమయంలో, చాలామంది లబ్ధిదారులు వాటిని ఇడ్లీ, దోసెలు, పిండి పట్టించడం వంటి ఇతర అవసరాలకు ఉపయోగించారు. కొందరు దొడ్డు బియ్యాన్ని అమ్ముకుని సన్న బియ్యం కొనేవారు. అయితే, సన్న బియ్యం నాణ్యతతో ఆకర్షణీయంగా ఉండటంతో దీనిని ప్రధానంగా తినేందుకే వినియోగిస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. సన్న బియ్యాన్ని అన్నం వండుకునేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడిన 'సాక్షి' బృందం, సన్న బియ్యం నాణ్యతపై సంతృప్తి, దాని వినియోగంలో సానుకూల ధోరణిని గమనించింది.

సమర్థవంతమైన నిర్వహణ

సన్న బియ్యం పంపిణీ రేషన్ షాపుల ద్వారా సజావుగా కొనసాగుతోంది. తొలి మూడు నాలుగు రోజుల్లో లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద బారులు తీరారు, 80 నుంచి 90 శాతం మంది ఇప్పటికే తమ వాటాను స్వీకరించారు. ఈ సమర్థవంతమైన పంపిణీ వల్ల లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందింది. రేషన్ షాపుల వద్ద ఎలాంటి గందరగోళం లేకుండా, వేగంగా పంపిణీ జరిగింది. సన్న బియ్యం అందుబాటులోకి రావడంతో, లబ్ధిదారులు తమ కోటాను స్వీకరించారు.

వండుకుని తింటున్నం..

ప్రభుత్వం దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం ఇవ్వడంతో వండుకుని తింటున్నం. గతంలో దొడ్డు బియ్యం తెచ్చుకుని దోశలు చేసుకునేందుకు పిండి పట్టించుకునే వారం. ఇప్పుడు అన్నం వండు కొని తింటున్నం. – గంగేశ్వరి, నిర్మల్

సన్న బియ్యం ఇవ్వడం సంతోషకరం..



ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. సన్న బియ్యం బాగానే ఉన్నాయి. బయట కొనుక్కునే ఖర్చు తగ్గింది. అయితే అన్నం వండితే మెత్తగా అవుతుంది. రెండు, మూడు రకాల బియ్యం కలవడం వల్ల అలా అవుతుంది. – దండు శ్యామల, న్యూవెల్మల్

అన్నం ముద్దగా అవుతోంది..



రేషన్ దుకాణంలో ఇస్తున్న సన్న బియ్యం వండితే అన్నం ముద్దగా అవుతుంది. తినడానికి ఇబ్బందిగా ఉంది. బియ్యంలో సగానికిపైగా నూకలు ఉన్నాయి. సన్న బియ్యం ఇవ్వడం సంతోషమే కానీ తినడానికి వీలుగా ఉండే బియ్యం ఇస్తే బాగుంటుంది. – అరుణ, నిర్మల్

నూకలు వస్తున్నయి..



మా కుటుంబానికి ఈనెల సన్న బియ్యం ఇచ్చిండ్రు. అందులో కొంత వరకు నూకలు వచ్చినయి. మిగతా బియ్యం మంచిగనే ఉన్నయ్. ఇవే మాకు ఆధారం. ప్రతీనెల సన్న బియ్యం ఇస్తే మాకు ఎంతో ఆసరాగా ఉంటుంది. – విజయ, వైఎస్సార్ కాలనీ

ఎప్పుడూ ఇలాగే పంపిణీ చేయాలి



సన్న బియ్యం ఈ నెల మాదిరిగానే ప్రతీనెల పంపిణీ చేయాలి. దీంతో లబ్ధిదారులెవరూ రేషన్ బియ్యం బయట విక్రయించరు. అక్రమాలకు అవకాశం ఉండదు. కొత్త రేషన్ కార్డులు రాక చాలా మందికి అర్హత ఉన్నా అందడం లేదు. – బొప్పారపు శ్రీనివాస్, ఖానాపూర్

'భూభారతి'తో సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన అదనపు కలెక్టర్, ఆర్డీవోలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: భూభారతి చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం ఉంటుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ భూభారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్)–2025 చట్టంపై రెవెన్యూ అధికారులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. చట్టంలో పొందుపరిచిన అన్ని అంశాలను కూలంకశంగా అధికారులకు వివరించారు. భూభారతి చట్టంపై ప్రతీ అధికారి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. ఈనెల 17 నుంచి అధికారులంతా గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి చట్టంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల వివరాలు సేకరించాలన్నారు. భూభారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని తెలిపారు. నూతన చట్టం ప్రకారం భూములకు భూదార్ కార్డులు మంజూరు చేసే వెసులుబాటు కల్పించారన్నారు. భూ విషయాలకు సంబంధించి చిన్నచిన్న సవరణల ప్రక్రియ అత్యంత సులువుగా, వేగంగా పూర్తవుతుందని తెలిపారు. సదస్సులో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే భూ బదలాయింపులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో అభివృద్ధి పనులకు అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అటవీ భూముల్లో చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలోనే మంజూరు చేసి, అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ భూముల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ప్రాజెక్టులు, పంచాయతీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర, రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీ శాఖ రెవెన్యూ, విద్యుత్, ఇంజినీరింగ్ శాఖలతో సమన్వయంగా పని చేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీఎఫ్‌వో నాగిని భాను, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ధైర్యంగా చదువుకోవాలి

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: విద్యార్థినులకు పోలీసులు అండగా ఉంటారని, ధైర్యంగా చదువుకోవాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లాలో వారంలో ఒకరోజు కేజీబీవీలో మహిళా పోలీసులు నిర్వహిస్తున్న 'పోలీస్ అక్క' కార్యక్రమంపై జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుళ్లను పర్యవేక్షణ అధికారులుగా నియమించామని తెలిపారు. వారు వారంలో ఒకరోజు పాఠశాలను సందర్శిస్తారని, రాత్రి అక్కడే బస చేసి పిల్లలతో గడుపుతూ.. వారి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు. విద్యార్థులను మానసికంగా ఉత్తేజపరిచి, తదుపరి చదువులపై సలహాలు సూచనలు చేస్తారన్నారు. ఉదయం మానసిక ఉల్లాసం, శారీరక ఉత్తేజం కోసం యోగా చేయిస్తారని తెలిపారు. ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్ మీనా, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ
- ఈ నెల 22 వరకు కొనసాగనున్న కార్యక్రమం

జిల్లా సమాచారం..	
జిల్లాలోని ప్రాజెక్టులు 04	
అంగన్‌వాడీ కేంద్రాలు 926	
0 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 57,077	
గర్భిణులు 5,916	బాలింతలు 6,012



కార్యక్రమ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

లక్ష్మణచాంద: చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపాన్ని అధిగమించి, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 8న ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. 22వ తేదీ వరకు కొనసాగనుంది. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపాన్ని తొలగించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

జిల్లాలో ఇలా...

జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ డివిజన్‌లలో కలిపి మొత్తం 926 అంగన్‌వాడి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 816 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 110 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఈ కేంద్రాల ద్వారా 0–6 సంవత్సరాల వయస్సు గల 57,077 మంది చిన్నారులు, 5,916 మంది గర్భిణులు, 6,012 మంది బాలింతలు సేవలు పొందుతున్నారు.

పోషణ పక్వాడ కార్యకలాపాలు

ఆరోగ్య పరిశీలన: గర్భిణులు, చిన్నారుల బరువు తనిఖీ చేయడం, రెండేళ్లకన్నా తక్కువ వయస్సు గల చిన్నారుల పెరుగుదలను పరిశీలించడం.

తల్లిపాల అవగాహన: గ్రామాల్లో ఇంటింటి సందర్శనలు చేసి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడం.

పోషకాహార విద్య: గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతను ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వివరించడం.

వ్యక్తిగత పరిశుభ్రత: వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం మరియు రక్త పరీక్షలు నిర్వహించడం.

పోషకాహార వంటకాలు: ఆహార పదార్థాలు, చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ వంటకాలు తయారు చేసి, పోషకాహార విలువలను ప్రత్యక్షంగా తెలియజేయడం.

టీకాల షెడ్యూల్ తనిఖీ: వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్‌ను పరిశీలించడం.

గర్భిణుల సంరక్షణపై అవగాహన: గర్భిణుల సంరక్షణలో భర్తల పాత్రపై అవగాహన కల్పించడం.

ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంతోపాటు, సమాజంలో పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో స్త్రీ శిశుసంక్షేమ శాఖ పనిచేస్తోంది.

అందరూ పాల్గొనాలి

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపం నివారించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. – నాగలక్ష్మి, ఇన్‌చార్జి, డీడబ్ల్యూవో

ఎదుగని చేప!



ఇవి ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం చేద్వాయి చెరువులోని చేపలు. ఈ చెరువులో గత సెప్టెంబర్‌లో ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చిన 50వేల చేప విత్తనాలు విడుదల చేశారు. ఈ సమయానికి కిలోన్నర వరకు బరువు ఉండాలి. కానీ అరకిలో వరకే ఉన్నాయి.

- నాసిరకం విత్తనంతో నష్టాలు
- బరువు పెరగని సబ్సిడీ చేపలు
- మత్స్యకారులకు తగ్గిన దిగుబడి
- ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వందశాతం సబ్సిడీతో చేప విత్తన పంపిణీ లక్ష్యం నీరుగారిపోతోంది. అదునులోపు చేప విత్తనం పంపిణీ చేయక పోవడం ఒక కారణమైతే.. నాసిరకం విత్తనాలతోనూ మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈసారి లక్ష్యం కంటే సగానికి తక్కువగానే చేపపిల్లలను నీటిలో వదిలారు. వర్షాకాలం ఆరంభంలో కాకుండా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు విడుదలలో జాప్యం జరిగింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 994నీటి వనరుల్లో లక్ష్యం ప్రకారం 6కోట్లకు పైగా చేపపిల్లలను వదలాల్సి ఉన్నా 3.57 కోట్ల చేపపిల్లలు వదిలారు. రవు, బొచ్చె రకాలు ఎక్కువగా ఉన్నాయి. 35ఎంఎం నుంచి 40ఎంఎం, 80నుంచి 100ఎంఎం పరిమాణం ఉన్న చేపపిల్లలను వదిలారు. అయితే అవి ఆశించిన స్థాయిలో ఎదుగక సరైన దిగుబడి రాలేదు. కొన్ని చోట్ల మత్స్యకార సంఘాల సభ్యులే సొంత డబ్బులతో చేపపిల్లలు కొనుగోలు చేసి పెంచుతున్నారు. మంచిర్యాల జిల్లాలో మొత్తం 372చెరువుల్లో 1.09కోట్ల చేపపిల్లలకు గాను 47చెరువుల్లోనే 2.99లక్షల చేపపిల్లలు వదిలారు.

జాప్యం.. నాసిరకం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో రూ.లక్షలు వెచ్చించి, చేపపిల్లలను కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచి అప్పగించింది. గత సర్కారు హయాంలో భారీగా అవకతవకలు జరిగాయని కొన్ని చోట్ల ఒప్పందాలు ర ద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇచ్చారు. అయినా విత్తనంలో నాణ్యత లేక చాలా చోట్ల లక్ష్యం మేర చేపలు బరువు పెరగలేదు. అదే సమయంలో ప్రైవేటుగా కొనుగోలు చేసిన చేప విత్తనాలు మాత్రం బరువు పెరిగినట్లుగా చెబుతున్నారు. ఏటా వానాకాలంలో చేప విత్తనాలను ఎల్లంపల్లి, అడ(కుమురం భీం), కడెం, పీపీ రావు, సాత్నాల, స్వర్ణ, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలీ తదితర ప్రాజెక్టుల్లో వదులుతున్నారు. ఈసారి ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువుల్లోనూ ఆశించిన మేర దిగుబడి లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

నాసిరకంగా ఉన్నాయి..



గతేడాది కంటే ఈ ఏడాది చేప విత్తనాలు నాసిరకంగా ఉన్నాయి. ప్రభుత్వం చేప విత్తనాలకు బదులు నేరుగా డబ్బులు సొసైటీ సభ్యులకు జాయింట్ ఖాతాల్లో వేస్తే మేమే విత్తనాలను కొనుగోలు చేసుకుంటాం. – పుట్టి నర్సయ్య, నర్సాపూర్(డబ్ల్యూ), లక్ష్మణచాంద మండలం, నిర్మల్ జిల్లా

డిప్లొమాతో ఉజ్వల భవిష్యత్తు

- ఏప్రిల్ 19 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మే 13న ప్రవేశ పరీక్ష



డా.రమేష్, ప్రిన్సిపాల్ పాలిటెక్నిక్ కళాశాల నిర్మల్

లక్ష్మణచాంద: తెలంగాణ స్టేట్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ పాలిసెట్) 2025 మే 13న జరుగనుంది. ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో చేరా లనుకునే విద్యార్థులకు ఈ పరీక్ష కీలకమని నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, బెల్లంపల్లి, ఉట్నూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ డిప్లొమాలతోపాటు అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పాలిసెట్ ద్వారా డిప్లొమా పూర్తి చేసినవారు ఇంజనీరింగ్ డిగ్రీలో రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చని తెలిపారు. సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

పరీక్ష వివరాలు
దరఖాస్తు: polycet. sbtet. telangana. gov. inలో అందుబాటులో ఉంది.
చివరి తేదీ: ఏప్రిల్ 19, 2025 (ఫీజు లేకుండా); ఏప్రిల్ 23, 2025 (రూ.300 ఆలస్య రుసుముతో).
పరీక్ష విధానం: ఆఫ్‌లైన్, 2.5 గంటలు, 150 ప్రశ్నలు (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ).
పరీక్ష తేదీ : మే 13, 2025.

క్లుప్తంగా

తొమ్మిది మంది బైండోవర్

నెన్నెల(బెల్లంపల్లి): పేకాడుతూ పట్టుబడిన ఐదుగురిని, గంజాయి సేవిస్తూ పట్టుబడిన మరో నలుగురిని మంగళవారం తహసీల్దార్ మహేంద్రనాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇకపై మంచి మార్గంలో నడుచుకోవాలని వారికి సూచించినట్లు పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించి ఇదే నేరాన్ని మరోసారి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కడెం(ఖానాపూర్): మండలంలోని లింగాపూర్‌లో పడాల గంగవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. గంగవ్వ ఇటీవల మండలంలోని పాత మద్దిపడగలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లింది. ఈనెల 14న రాత్రి దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మంగళవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు వృద్ధురాలికి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్లూస్‌టీం సిబ్బంది ఇంటిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలను పగులగొట్టి మూడు తులాల బంగారం, పది తులాల వెండి కడియాలు, రూ.15 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్‌చాందలో..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఈ నెల 13న లక్ష్మణ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చే చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో ఉన్న 3 తులాల బంగారం, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో రెండిళ్లలో..

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ కాలనీలో గల షేక్ సాబీర్ ఈనెల 14న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అదే ఇంటిపక్కన ఉన్న మహ్మద్ అన్వర్ అహ్మద్ ఇంటితాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని రూ.6వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు.

జీవాల పెంపకానికి చేయూత

- ఎన్ఎల్ఎం ద్వారా రుణాలు
- యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ
- గరిష్టంగా రూ.50 లక్షల వరకు మంజూరు

యూనిట్ సబ్సిడీ

(గొర్రెలు,పొట్టేళ్లు)	(రూ.లక్షల్లో)
500-25	50
400-40	40
300-15	30
200-10	20
100-05	10



లక్ష్మణచాందలో గొర్రెల మంద

లక్ష్మణచాంద(నిర్మల్): దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాంసం ఉత్పత్తులు పెంచాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. మాంసానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా జీవాల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీం(ఎన్ఎల్ఎం) ద్వారా ఔత్సాహికులకు సబ్సిడీ రుణాలు అందిస్తోంది. 2021–22లో ప్రారంభించిన ఈ పథకాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది. ఈ పథకం కింద పెంపకందారులకు ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. యూనిట్ మంజూరైనప్పటి నుంచి పూర్తిస్థాయిలో సబ్సిడీ నిధులు విడుదలయ్యే వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షిస్తుందని అధికారులు తెలిపారు. గరిష్టంగా యూనిట్‌కు రూ.50 లక్షల వరకు రుణం అందించనున్నారు. ఈ రుణం డబ్బులను రెండు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

దరఖాస్తు ఇలా..

గొర్రెలు,మేకల యూనిట్ల పెంపకం రుణం మంజూరు కోసం www. nim. udyamimitra. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఈ రుణాలు పొందడానికి దరఖాస్తు చేయడానికి ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని అధికారులు అంటున్నారు. రుణం మంజూరుకు దరఖాస్తు చేస్తున్న ఉత్సాహవంతులు తమ పాన్, ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, పాస్‌ఫొటో, రుణం తీసుకునే బ్యాంకు స్టేట్‌మెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

అర్హతలు

1. కనీసం ఐదెకరాల వ్యవసాయ భూమిని కలిగి ఉండాలి. ఇతరులదైనా లీజుకు తీసుకోవాలి.
2. పశు పోషణలో తగిన అనుభవం ఉండాలి.
3. యూనిట్ మంజూరు కోసం బ్యాంక్ కాన్సెంట్ తీసుకోవాలి.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలి. ఈ దరఖాస్తు చేసుకుని యూనిట్ పొంది ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలి.

– ఎండీ బాలిగ్ అహ్మద్, జిల్లా పశువైద్యాధికారి, నిర్మల్

పెళ్లి ఘడియలు

- మూడు నెలలపాటు శుభ ముహూర్తాలు



దండేపల్లి(మంచిర్యాల): ముహూర్తాల కోసం వేచి చూస్తున్న వారికి తీపి కబురు అందింది. మండు వేసవిలో శుభఘడియలు వచ్చాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో తెలుగింట 'రారండోయ్..వేడుక చేద్దాం' అంటున్నారు. వరుసగా మంచిరోజులు రావడంతో పెళ్లి మండపాలు, బ్యాండ్‌మేళాలకు డిమాండ్ ఏర్పడింది. పురోహితులు, వంట మనుషులు, వీడియో గ్రాఫర్లకు, ఆర్డర్లు తలుపు తడుతున్నాయి.

ముహూర్తాలు ఇవే..

ఏప్రిల్‌లో 16, 18, 20, 23, 30 తేదీల్లో, మే నెలలో 1, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 21, 23, 28, 30, 31 తేదీల్లో, జూన్ నెలలో 2, 4, 5, 6, 7, 8 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. జూన్ 11 నుంచి జూలై 12 వరకు మూఢం రావడంతో ముహూర్తాలకు కొంత విరామం వచ్చింది. తిరిగి మళ్లీ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు మొదలు కానున్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సరంలో శుభముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో పెళ్లిళ్లు కూడా ఎక్కువగానే జరుగనున్నాయి.

మూణ్నెళ్లు శుభఘడియలు



మూడు నెలలపాటు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు జరుపుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా ఈ నెల 30న అక్షయ తృతీయ రావడంతో ఆరోజు దివ్యమైన ముహూర్తం ఉంది. నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నవారు వేడుకలకు సిద్ధమవుతున్నారు.

– గొల్లపెల్లి రామానందాచార్య స్వామి, వేదపండితులు

ఆర్టీసీ డ్రైవర్‌కు 18 నెలల జైలు

శ్రీరాంపూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు 18 నెలల జైలుశిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు జడ్జి డీ.ఉపనిషద్వని మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సంతోశ్ తెలిపారు. 2017, నవంబర్ 06న శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న పోతనవేణి మల్లమ్మను ఏ.సంతోశ్‌కుమార్ అజాగ్రత్తగా బస్సు నడుపుతూ ఢీకొట్టాడు. గాయపడిన మల్లమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కటిక రవిప్రసాద్ కేసు నమోదు చేశారు. మంగళవారం 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లారీ కిందపడి యువకుడు మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన చెందిన కృష్ణ (24)మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై భైంసావైపు వెళ్తుండగా చిట్యాల బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో యువకుడు లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో దిలావర్‌పూర్ మండలంలోని కాలువ తాండ నుంచి బైక్‌పై వస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజు, రాకేష్ ఆగి ఉన్న అదే లారీని వెనుకనుంచి ఢీ కొట్టి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నస్పూర్: పట్టణ పరిధిలోని దొరగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి తెల్లవారుజామున దొరగారి పల్లె వద్ద జాతీయ రహదారి 363 దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. వివరాలకు 8712656539 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహారాష్ట్ర ప్రమాదంలో జిల్లా యువకుడు..

తాంసి(బోథ్): మహారాష్ట్రలో జరిగిన ప్రమాదంలో జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భీంపూర్ మండలం జల్ కోరి పంచాయతీ పరిధిలోని లీంగూడకు చెందిన ఆత్రం రాము (18) సోమవారం సాయంత్రం తన మిత్రుడితో మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ బయలుదేరాడు. జరూర్ గ్రామ సమీపంలో కొందరు రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొడుతుండగా కొమ్మలు వచ్చి యువకులు వెళ్తున్న బైక్‌పై పడ్డాయి. ఘటనలో రాముకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు రాజుకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్రలోని మాండ్వి పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆత్రం రాము (ఫైల్)

ధైవదర్శనానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



సంఘటన స్థలంలో రాజు మృతదేహం

దిలావర్‌పూర్(నిర్మల్): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఎల్.సందీప్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన దిడ్డోలి రాజు (45) కుటుంబం సర్సాపూర్(జి) మండలంలోని అర్లి వద్ద ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారు జామున రాజు భార్య, ఇద్దరు పిల్లలు ఆటోలో పంపించారు. రాజు, అతని కుమారుడు కేదార్‌నాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుగుప్రయాణంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ సమీపంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందగా కేదార్‌నాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని కేదార్‌నాథ్‌ను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాహనంలో తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సోన్(నిర్మల్): మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి తెలిపారు. మృతుని వయస్సు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, తల వెంట్రుకలు పొడవుగా ఉన్నాయని, వేసుకున్న బట్టలు మాసిపోయి ఉన్నాయన్నారు. కడ్తాల్ మాజీ సర్పంచ్ బర్మా రాజానర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

సారంగపూర్(నిర్మల్): మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన నిర్మల రాజు(41) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. బెబ్లూలీ ఏరియాలో గల వేడామ్స్ కంపనీలో కూలీపనులు చేస్తున్నాడు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 7న మృతి చెందాడు. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఎడారి దేశంలో దిక్కుతోచని స్థితిలో జీవి విడిచావు.. ఇక్కడికి వచ్చినా మేము కాపాడుకునేవాళ్లం.. ఇప్పుడు పిల్లలను ఎలా సాకాలయ్యా.. అని మృతుని భార్య రుక్మవ్వ రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతునికి భార్య రుక్మవ్వ, కుమారుడు అఖిల్, కుమార్తె శృతి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ మండలం ఒడ్డేపల్లికి చెందిన కుంచపు సురేష్ తన భార్య గంగామణి, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై కుందాపూర్ ఎల్లమ్మ వద్దకు వెళ్లి వస్తుండగా సర్సాపూర్(జి)కి చెందిన జావేద్, తన కుమారుడితో కలిసి బైక్‌పై దిలావర్‌పూర్ బయలుదేరాడు. మార్గమధ్యలో జాతీయ రహదారిపై సురేష్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఘటనలో గంగామణి, జావేద్, అతని కుమారుడికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

500 దేశీదారు సీసాలు స్వాధీనం



దేశీదారు, నిందితుడితో ఎక్సైజ్ సీఐ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని భీంసరిలో 90 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 500 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ మహారాష్ట్రలోని చనాక నుంచి ద్విచక్ర వాహనంపై దేశీదారు తీసుకువస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.18వేలు ఉంటుందన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 54వ సీనియర్ మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 80 మంది మహిళా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 20 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మంచిర్యాల జిల్లాలోని మందమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, పీడీ, పీఈటీలు రవి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు



మెమొంటో అందుకుంటున్న రామ్ అక్షరేష్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన నామని రమేశ్ కుమార్, మౌనిక దంపతుల కుమారుడు రామ్ అక్షరేష్ 8 నిమిషాల్లో 300ల పదాలను పఠించడం ద్వారా వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు. ఎల్‌కేజీ చదువుతున్న రామ్ అక్షరేష్ తెలుగు సంవత్సరాలు, నెలలు, తిథులు, రాష్ట్ర రాజధానులు, జాతీయ చిహ్నాలు, గ్రహాలు, ఆవిష్కరణలు, చారిత్రాత్మక కట్టడాలతో సహా 300ల వరకు 8 నిమిషాల్లోనే పఠించడం ద్వారా రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారత దేశ ప్రతినిధి బింగి నరేంద్ర గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్లు డాక్టర్ వేణుకుమార్, కే.రవికుమార్ చిన్నారికి మెమొంటో అందజేశారు.

అమ్మా.. క్షమించు

- అన్నయ్యా.. సారీ..
- నా ఆరోగ్యం మెరుగుపడడం లేదు
- బాధ భరించలేకపోతున్నా'
- సూసైడ్ నోట్ రాసి యువకుడి బలవన్మరణం



అనిల్ (ఫైల్)

నెన్నెల(బెల్లంపల్లి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు చికిత్స చేయించుకున్నా మెరుగు పడకపోవడంతో మనస్తాపం చెందాడు. అనారోగ్యం బాధను భరించలేకపోయాడు. ఇక చావే శరణ్యమనుకున్నాడు. ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌లో జరిగింది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెల్మాటికారి సత్తయ్య, అమృత దంపతుల కుమారుడు అనిల్ (24) పీజీ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా పచ్చకామెర్లు, దవడ బిల్లలు, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లోనే దూలానికి చీరతో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఉరేసుకునే ముందు బెడ్‌రూమ్‌లో అతని మంచంపై సుసైడ్ నోట్ రాసి పెట్టాడు. 'అమ్మా.. నన్ను క్షమించండి.. నాకు ఆరోగ్యం బాగుండడంలేదు. బాధ భరించలేక చనిపోతున్నా. నా చావుకు ఎవరూ కారణం కాదు. నా సొంత నిర్ణయంతో చనిపోతున్నా. అన్నయ్య సారీ రా... నీవు ఈ లెటర్ చదివే సమయానికి నేను నీతో ఉండను.. అమ్మా నాన్నను కష్టపెట్టకు.. నన్ను మీరంతా క్షమిస్తారని ఆశిస్తూ.. సెలవు తీసుకుంటున్నా.. అని నోట్ రాసి ఉంచాడు. మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం

అనిల్ కళ్ల దానం చేయడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చి సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భీం పుత్ర శ్రీనివాస్, బ్లడ్ డోనర్ అసోసియేషన్ అధ్యక్షుడు రహీమ్‌కు సమాచారం అందించారు. దీంతో వారు హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్‌కుమార్‌కు తెలియజేయడంతో గ్రామానికి వచ్చి నేత్రాలు సేకరించారు.

పోలీసుల పనితీరు భేష్

- 40 నిమిషాల్లోనే దొంగను పట్టుకున్న వైనం



చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఒకరి వద్ద నుంచి రూ.36వేల నగదు అపహరించిన దొంగను కేవలం 40 నిమిషాల్లోనే గుర్తించిన ఆసిఫాబాద్ పోలీసులు భేష్ అనిపించుకున్నారు. సీఐ బుద్దె రవీందర్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రానికి చెందిన మీర్ అలీ మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్ వద్ద తన స్కూటీని పార్కింగ్‌లో చేశాడు. డిక్కీలో ఉన్న రూ.36వేల నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు తిరుపతి, సాగర్ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రవీందర్, ఎస్సై అంజయ్య, బ్లూకోర్ట్ కానిస్టేబుల్ సాగర్, తిరుపతిని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్త రంజన్ అభినందించారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

దండేపల్లి: మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కల్లెం సంతోశ్‌పై దాడికి పాల్పడిన లక్కాకుల సృజన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. నర్సాపూర్ సమీపంలోని తాటిచెట్ల వద్ద మొరం డబ్బుల విషయంలో ఇద్దరూ గొడపడ్డారు. ఈక్రమంలో మాటామాట పెరగడంతో సంతోశ్‌పై సృజన్ కర్రతో దాడిచేయడంతో గాయాలయ్యాయి. బాధితుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూల్చిన ఇద్దరికి జైలుశిక్ష

మంచిర్యాలక్రైం: ప్రహరీ, పైపులైన్, గేట్లు కూల్చివేసిన ఇద్దరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో నివసించే లక్సెట్టి మల్లయ్య, అప్పాసు కిషన్, నెల్కి మల్లేశ్, బీ.కిషన్‌కు సంబంధించిన ప్రహరీ, గేట్లు, పైపులైన్‌ను సదానంద గౌడ్, సురేష్ 2020 జూన్1న జేసీబీతో ధ్వంసం చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి...

నిర్మల్‌టౌన్: మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి నిర్మల్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపారు. భైంసా మండలం సిరాలకు చెందిన మహిళ, భైంసా పట్టణంలోని ఇమ్రాన్ ఒకేచోట పనిచేసేవారు. రెండేళ్ల క్రితం రాజస్థాన్ వెళ్లిన మహిళ భర్త తిరిగిరాలేదు. దీంతో ఇమ్రాన్ ఆమెను లొంగదీసుకునేందుకు యత్నించాడు. 2020, జూన్ 16న రాత్రి మహిళ ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి లైంగికదాడికి యత్నించాడు. ప్రతిఘటించిన మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. సదరు మహిళ భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పున్నంచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీ.శ్రీనివాస్ పైవిధంగా తీర్పునిచ్చారు.

ముగ్గురు యువకుల రిమాండ్

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రిలో ఈ నెల 13న రాత్రి పంచశీల జెండాలను అవమానపర్చిన ఘటనలో గ్రామానికి చెందిన కొగురు అరుణ్, యాల్ల ఉదయ్‌కిరణ్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. దర్యాప్తులో ముగ్గురు యువకులు నిందితులుగా తేలడంతో బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అడవిలో మంటలు

కడెం: మండలంలోని నర్సాపూర్ సమీపంలో మంగళవారం రాత్రి కార్చిచ్చుతో అడవిలో మంటలు వ్యాపించాయి. అటవీ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నా అడవిలో మంటలు ఆగడం లేదు. సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.